



విద్యార్థులేరీ..?

- నిధులున్నా దావణగెరె విశ్వవిద్యాలయం దుస్థితి
- వర్సిటీ పరిధిలో 130 కళాశాలలు..
- ఏటా రూ.40 కోట్ల ఆదాయం
- 9 పీజీ కోర్సులకు తగ్గిన డిమాండ్
- కొనసాగుతున్నవి కొన్నే..

బెంగళూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యకు పేరొందిన రాష్ట్రంలో పలు యూనివర్సిటీలలో నిధులు కొరత వెంటాడుతుండగా దావణగెరె యూనివర్సిటీలో మాత్రం గ్రాంట్లకు ఇబ్బంది లేకున్నా విద్యార్థులు కరువు కావడం గమనార్హం. కువెంపు యూనివర్సిటీ నుంచి వేరై 2009లో ఏర్పాటైన దావణగెరె యూనివర్శిటీకి జిల్లాలోని తోళహుణసె వద్ద సుమారు 74 ఎకరాలలో ఉంది. ఎమ్మెల్యే డాక్టర్ శామనూరు శివశంకరప్ప, దివంగత రాజనహళ్ళి హనుమంతప్ప సహా పలువురు దాతలు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సహకరించారు. దీనికితోడు దావణగెరె తాలూకాలోని ఉళుపినకట్టె వద్ద 72 ఎకరాలలో ప్రభుత్వం స్థలం కేటాయించింది. చిత్రదుర్గ దొడ్డరంగవ్వనహళ్ళి సమీపాన 30 ఎకరాలలో క్యాంపస్ నిర్మించారు. ఉభయ జిల్లాల్లో 45 వేలమంది డిగ్రీ, 2,800మంది పీజీ విద్యార్థులు ఉన్నారు. దావణగెరె, చిత్రదుర్గ జిల్లాల్లో దావణగెరె విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ సహా 130 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

ఇటీవల యూనివర్సిటీలో న్యాక్ గుర్తింపులో అవినీతి, ప్రొఫెసర్ల సస్పెన్షన్, పరీక్షల్లో ఆన్సర్లతోకూడిన ప్రశ్నాపత్రం, సమగ్రంగా లేని ప్రశ్నాపత్రం ఇలా ఏదో ఒక అంశంలో వివాదంలో ఉన్న దావణగెరె యూనివర్సిటీలోని 9 పీజీ కోర్సులలో విద్యార్థులు కొరత ఉండడం చర్చనీయాంశమైంది.

33 పీజీ కేంద్రాలు..

దావణగెరె యూనివర్సిటీలో ఆర్ట్స్, కామర్స్, సైన్స్ సహా మొత్తం 33 పీజీ అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 24 కోర్సులు ఆటంకం లేకుండా కొనసాగుతున్నాయి. మిగిలిన విభాగాల్లోనే విద్యార్థుల కొరత స్పష్టంగా తెలుస్తోంది. కొన్ని విభాగాల్లో చేరిన విద్యార్థులు పనికి వెళ్తుండగా పరీక్షలకు మాత్రం హాజరవుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని పీజీ కోర్సులలో కనీస స్థాయిలో విద్యార్థులు అడ్మిషన్లు పొందినా తరగతులు మాత్రం అంతంత మాత్రమే అని తెలుస్తోంది. అయితే డిమాండ్ ఉన్న కామర్స్, ఎంకాం కోర్సు విద్యార్థులు యూనివర్సిటీ కంటే కళాశాలల్లోనే



ఎక్కువగా ఉంటారని తెలుస్తోంది. సోషల్ స్టడీస్ విభాగంలో విద్యార్థులు ఎక్కువమంది తరగతులకు హాజరు కాకుండా పనులకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. సంస్కృతి, ఫ్యాషన్ డిజైనింగ్ సహా పలు కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయి. కనీసస్థాయిలో అడ్మిషన్లు జరిగితేనే ఆ విద్యాసంవత్సరంలో కోర్సును కొనసాగించే అవకాశం ఉంటుందని అధికారుల ద్వారా తెలుస్తోంది.

ఆదాయానికి ఢోకా లేదు...

సాధారణంగా యూనివర్సిటీలలో గ్రాంట్ల కొరత ఉంటుంది. దావణగెరె యూనివర్సిటీ పరిధిలో దావణగెరె, చిత్రదుర్గ ఉభయజిల్లాల్లో 130కుపైగా కళాశాలలు, 40వేలకుపైగా విద్యార్థులు ఉన్నారు. వివిధ వనరుల ద్వారా ఏటా రూ.35-40 కోట్లదాకా ఆదాయంతో ఆర్థికంగా బలోపేతంగా ఉంది. వచ్చే ఆదాయంలో క్యాంపస్ నిర్వహణ, బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు ఇతరత్రా వాటికి గ్రాంట్ల కొరత లేదు. 130 మంది పర్మనెంట్, 35 బోధనేతర సిబ్బందికి ప్రభుత్వమే వేతనాలు భరిస్తోంది. కొవిడ్ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన బ్లాక్ గ్రాంట్ ఆగిపోయింది. పర్మనెంట్ బోధకులకు మాత్రం ప్రభుత్వమే వేతనాలు చెల్లిస్తోంది. అధ్యయనం, అధ్యాపన, పరిశోధన, ప్రజల కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ఇస్తున్న గ్రాంట్లు నిలిచిపోయాయి. దీంతో యూనివర్సిటీలో కేవలం పాఠాలు బోధించడం మినహా సదస్సులు, చర్చాగోష్ఠులు, విద్యాసమావేశాలు వంటివి మాత్రమే కొనసాగుతున్నాయి.

విద్యార్థుల ఖాతాలకు స్కాలర్‌షిప్

కాగా ఎస్సీ విద్యార్థుల ఫీజును ప్రభుత్వమే భరించేది. ఇదివరకు నేరుగా యూనివర్సిటీకి మంజూరు చేసేవారు. కొన్నేళ్లుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. ఇలా స్కాలర్‌షిప్‌ల రూపంలో వస్తున్న మొత్తాన్ని విద్యార్థులు చాలామంది యూనివర్సిటీకి సకాలంలో చెల్లించడం లేదు. సిబ్బంది వేతనాలకు మినహా పరిశోధనలు, యూజీసీ, ఐసీఎస్ఎస్ఆర్‌లకు గ్రాంట్లు అందడం లేదని తెలుస్తోంది.

సైన్స్ ల్యాబ్‌కు గ్రాంటు కోత

విద్యార్థులకు ప్రాక్టికల్స్ నేర్పించేందుకు సైన్స్ విభాగంలో తగినంత నిధులు లేవు. గతంలో ఏడాదికి రూ.2లక్షలు కేటాయించేవారు. ప్రస్తుతం దీన్ని రూ.1.50లక్షలకు తగ్గించారు. సైన్స్ ప్రయోగాలకు ప్రతి విభాగానికి రూ.5-10లక్షలు అవసరం, పరిశోధనా సామగ్రి, యంత్రోపకరణాల కొరత ఉంది. యూనివర్సిటీ ప్రారంభమైన కొత్తలో కేటాయించిన మైక్రోస్కోప్‌లే నేటికీ వినియోగిస్తున్నారు. పుస్తకాల పబ్లిషింగ్‌కు అవకాశం లేకుండాపోయిందని తెలుస్తోంది. భవనాలకు రంగులు, కొత్త అధ్యాపకులకు క్యాబిన్, కుర్చీ, పరిశోధనలకు ల్యాబ్ కొరత ఉందని తెలుస్తోంది.

గుణాత్మక విద్యకు ప్రాధాన్యం

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు యూనివర్సిటీ నిరంతరం శ్రమిస్తోందని కులపతి ప్రొఫెసర్ బీడీ కుంబార పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అంశంలోనే కాక పరిశోధనలలోనూ దావణగెరె యూనివర్సిటీ ముందంజలో ఉందన్నారు. జాతీయస్థాయిలో యూనివర్సిటీ వందో ర్యాంకులో ఉందన్నారు. 130మంది రెగ్యులర్ లెక్చరర్‌లు, 20మంది గెస్ట్ లెక్చరర్‌లు ఉన్నారన్నారు. ప్రభుత్వం నుంచి గ్రాంట్లు తగ్గినా ఉన్న వనరులతోనే చక్కగా నిభాయిస్తున్నామన్నారు.

అడ్జస్ట్‌మెంట్ రాజకీయాలతో బీజేపీకి తీవ్రనష్టం

- ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో మునిగిపోవడం ఖాయం
- పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశా
- 'ఎక్స్'లో ఎమ్మెల్యే యత్నాళ్



బెంగళూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అడ్జస్ట్‌మెంట్ రాజకీయాలు ఇదే తరహాలో కొనసాగితే రాష్ట్రంలో బీజేపీ పూర్తిగా మునిగిపోనుందని పార్టీ నుంచి ఆరేళ్ళపాటు వేటుకు గురైన విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌యత్నాళ్ అభిప్రాయ పడ్డారు. పార్టీనుంచి వేటుపడిన తర్వాత ఎక్స్ ద్వారా సుదీర్ఘమైన పోస్టింగ్ పెట్టారు. కొంతమంది రాజకీయ పట్టభద్రులు, అడ్జస్ట్‌మెంట్ రాజకీయాల కారణంగానే లోక్‌సభ ఎన్నికలలో గెలిచే సీట్లు ఓటమికి కారణమైనట్లు రాసుకున్నారు. కలబురగి, రాయచూరు, బళ్ళారి, చిక్కోడి స్థానాలలో ఓటమిపై అధిష్ఠానం కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడమే కళ్యాణకర్ణాటకలో పార్టీ ప్రభావం తగ్గేందుకు కారణమన్నారు. కార్యకర్తల పార్టీగా పేరొందిన బీజేపీ ప్రస్తుతం వారసత్వ రాజకీయాలకు బలవుతోందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సభల్లో పాల్గొనేవారిని వదిలి కళ్యాణకర్ణాటకలో పార్టీకోసం అహర్నిశలు పనిచేసే తనపై వేటు వేశారన్నారు. బీబీ శివప్ప, మల్లికార్జునప్ప, వీఎస్ ఆచార్య వంటి ఎంతోమంది వేలాది మంది కార్యకర్తలను బలోపేతం చేశారన్నారు. హిందుత్వ వాదనలో రాజీలేని పోరాటం చేశానన్నారు. సామాన్యుల భూములను వక్ఫ్ ఆస్తులుగా చూపే ప్రయత్నంపై జిల్లాలవారీగా పోరాటం చేసింది ఎవరనేది అందరికీ తెలుసని రాసుకున్నారు. తన ఆలోచనలు, విధానంలో ఎటువంటి మార్పు ఉండదన్నారు.

నేడు రెబల్స్ కూటమి ప్రత్యేక సభ

యత్నాళ్ ఒంటరివారు కాదని మేమంతా అండగా ఉన్నామని రెబల్ నేత రమేష్‌జార్కిహోళి అభిప్రాయపడ్డారు. బెళగావిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యత్నాళ్‌పై వేటు వేయడం వ్యతిరేక వర్గానికి హెచ్చరికగా ఉందని భావిస్తున్నామన్నారు. ఇదే విషయమై చర్చించేందుకు బెంగళూరులో శుక్రవారం ప్రత్యేక సభ జరుపుతున్నామన్నారు. రాజకీయాలలో కొన్ని సందర్భాల్లో సమస్యలు తలెత్తుతాయన్నారు. విజయేంద్ర గురించి ఏమీ మాట్లాడేది లేదన్నారు.

లింగాయత ఎమ్మెల్యేలూ బీజేపీని వీడండి...

బసనగౌడపాటిల్ యత్నాళ్‌పై ఆరేళ్ళు వేటుకు యడియూరప్ప కారణమని కూడలసంగమ మఠాధిపతి బసవమృత్యుంజయస్వామి మండిపడ్డారు. ధారవాడలో స్వామీజీ మీడియాతో మాట్లాడుతూ బీజేపీలోని లింగాయత ఎమ్మెల్యేలందరూ పార్టీ వీడిరావాలన్నారు. ఏప్రిల్ 10వ తేదీ వరకూ గడువు విధిస్తామని ఈలోగా బీజేపీ అధిష్ఠానం తగిన రీతిలో స్పందించకుంటే తమ సత్తా చూపుతామన్నారు.

మోదీని కలిసిన విజయేంద్ర, రాఘవేంద్ర

బెంగళూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీలో సంచలనం కలిగించేలా సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై ఆరేళ్ల వేటు పడిన మరుసటి రోజునే యడియూరప్ప ఇద్దరు కుమారులు ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలవడం విశేషం సంతరించుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, శివమొగ్గలోక్‌సభ సభ్యుడు రాఘవేంద్రలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి శుభకార్యానికి ఆహ్వానించారు. ఎంపీ రాఘవేంద్ర కుమారుడు సుభాష్ వివాహం జూన్‌లో జరుగనుంది. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను కుటుంబ సభ్యులతో కలిసి ప్రధానమంత్రికి అందించారు. ఇటీవలే సుభాష్, శ్రావణల నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. ప్రధానమంత్రిని కలిసిన తర్వాత విజయేంద్ర ఎక్స్‌లో ఫొటో షేర్ చేశారు. దేశాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్న గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి మా కుటుంబంలో శుభకార్యానికి అభిమానంతో ఆహ్వానించామంటూ పోస్టు చేశారు.



ప్రధానమంత్రిని ఆహ్వానిస్తున్న రాఘవేంద్ర, విజయేంద్ర



ముడా కార్యాలయం

మా చేతులు కట్టేశారు..!

- ముడా కమిషనర్‌కు ఈడీ సమన్ల రద్దుపై సొలిసిటర్ జనరల్ వాదనలు

బెంగళూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార మాజీ కమిషనర్ డీబి నటేష్‌ను విచారణ జరిపేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జారీ చేసిన సమన్లు రద్దుపై హైకోర్టు ఫుల్‌బెంచ్‌ను ఆశ్రయించారు. ఇదే విషయమై గురువారం హైకోర్టు ధర్మాసనం ముందు హాజరైన ఈడీ తరుపు సొలిసిటర్ జనరల్ విచారణ విషయంలో తమ చేతులు కట్టేశారన్నారు. ముడా ఇంటి స్థలాల అవినీతి వివాదంలో నిందితులకు జారీ చేసిన సమన్లను హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం రద్దు చేయడాన్ని ప్రశ్నిస్తూ ఫుల్‌బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఈడీ తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు గురువారం వాదనలు వినిపించారు. మాజీ కమిషనర్ నటేష్‌కు జారీ చేసిన సమన్లను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ కావడంపై తదుపరి కేసులో ప్రధానమైన నిందితురాలు పార్వతికి సమన్లు ఇచ్చేందుకు అవకాశం ఉండదన్నారు. కేసులో తదుపరి విచారణ జరిపే అవకాశమే లేకుండా పోయిందన్నారు. రానున్న రోజుల్లో ఇతర నిందితులు కూడా నటేష్ పొందిన సమన్ల రద్దు అంశంపైనే లబ్ధిపొందే అవకాశం ఉంటుందన్నారు. ఇలా ముడా కేసులో విచారణ ముందుకు సాగేందుకు వీలులేకుండా పోతోందన్నారు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.48 (శుక్రవారం సాయంత్రం)
సెహరీ : 5.06 (శనివారం ఉదయం)

నా హత్యకు కుట్ర..!

- సుపారీ ఇచ్చి చంపించాలని చూస్తున్నారు: డీజీపీకి మంత్రి రాజణ్ణ కుమారుడు, ఎమ్మెల్సీ రాజేంద్ర ఫిర్యాదు



డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్ర రాజణ్ణ

బెంగళూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార శాఖామంత్రి రాజణ్ణ హనీట్రాప్ చేసేందుకు కుట్రపన్నారని శాసనసభలో ప్రస్తావించిన తర్వాత తీవ్రమైన రోజుకో పరిణామాలు జరుగుతున్నాయి. తాజాగా గురువారం మంత్రి రాజణ్ణ కుమారుడు ఎమ్మెల్సీ రాజేంద్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై హత్యాయత్నానికి కుట్ర జరుగుతోందన్నారు. వారం రోజులుగా ప్రతిచోటా సాగుతున్న చర్చలపై విచారణ జరిపి ప్రాణరక్షణ కల్పించాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. గత ఏడాది నవంబరు 16న కుమార్తె జన్మదిన వేడుకలు జరిపామని షామియానా ఏర్పాటు చేసేవారి తరహాలో హత్య చేసేందుకు వచ్చారన్నారు. ఇటీవల జనవరిలో హత్యకు స్కెచ్ వేసిన విషయమై ఆడియో రికార్డులు ఉన్నాయన్నారు. ఆడియోలో హత్యకు సుపారీ ఇచ్చిన విషయం ఉందని ఐదులక్షలు సుపారీ ఇచ్చినట్లుగా ఉందన్నారు. హత్య చేసేందుకు వచ్చిన వారు సోము, భరత్ అనేవారుగా తెలిసిందన్నారు. కొన్నేళ్ళుగా తమ కుటుంబానికి సంబంధించిన కార్యక్రమాలకు షామియానా ఒక్కరే వేస్తారని వారి సప్లయర్స్‌లోనే పనిచేసేందుకు వచ్చిన వారి వెనుక కుట్ర ఉందన్నారు. హత్య చేసేందుకు సుపారీ జరిగిందనే విషయాన్ని ప్రస్తావిస్తున్నానని, తన తండ్రి మంత్రి రాజణ్ణ హనీట్రాప్ విషయమై ఫిర్యాదు చేశానన్నారు. హత్యకు సంబంధించిన ఫిర్యాదును తీసుకున్న డీజీపీ అలోక్‌మోహన్ తుమకూరు ఎస్పీను కలవాలని సూచించారన్నారు.

తమిళనాడులో గ్యాస్ ట్యాంకర్ల సమ్మె

ప్యారీస్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ చమురు సంస్థ హిందూస్థాన్ పెట్రోలియంతో కుదుర్చుకున్న ఒప్పందాలను సడలించని కారణంగా రాష్ట్రంలోని ఎల్పీజీ ట్యాంకర్ లారీల యజమానులు గురువారం నుంచి సమ్మె బాటపట్టారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల సౌత్‌జోన్ ఎల్పీజీ ట్యాంకర్ లారీల యజమానుల సంఘం రాష్ట్రంలోని నామక్కల్ కేంద్రంగా పనిచేస్తోంది. ప్రజాశాఖలోని ఆయిల్ సంస్థల యూనిట్లకు వంటగ్యాస్ తీసుకెళ్ళేందుకు ట్యాంకర్లను వినియోగిస్తున్నారు. ఆ మేరకు ఆయిల్ సంస్థలతో రాష్ట్రంలోని ట్యాంకర్ లారీల యజమానులు 2025 నుంచి 2030 వరకు కుదుర్చుకున్న ఒప్పందంలోని కఠిన నిబంధనలు సడలించాలని సౌత్‌జోన్ ఎల్పీజీ ట్యాంకర్ల యజమానుల సంఘం అధ్యక్షుడు సుందరరాజన్ పలుమార్లు చమురు అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఆలయాల ప్రసాదం

- దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దైవదర్శనాలకు వెళ్ళకపోయినా ప్రసాదాన్ని భక్తిభావంతో ఆస్వాదించాలనుకునే భక్తులకు ప్రత్యేక సౌకర్యం కల్పించినట్లు దేవదాయశాఖా మంత్రి రామలింగారెడ్డి అన్నారు. ధార్మిక పరిషత్ ప్రత్యేక సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు గురువారం మంత్రి తెలిపారు. ఎంపిక చేసిన ఆలయాలలో జయనగర్ వినాయక స్వామి, మండ్య చలువరాయస్వామి గుడి, నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయం, మాళూరు ప్రసన్నవెంకటేశ్వర ఆలయం, హలసూరు సోమేశ్వర ఆలయం, కొల్లూరు మూకాంబికా ఆలయం, గవిగంగాధరేశ్వర ఆలయం, బీదర్ నరసింహ ఆలయం, బెళగావి రేణుకాయల్లమ్మ ఆలయం, సుళ్య సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం, బళ్ళారి కనకదుర్గ ఆలయం, హూవినహడగలి మైలారలింగేశ్వర ఆలయం, కొప్పళ హులిగమ్మ ఆలయం, గుల్బర్గా గురుదత్తాత్రేయ ఆలయాలకు సంబంధించిన ప్రసాదాలు పొందే వెసలుబాటు ఉంటుందన్నారు. సమావేశంలో సభ్యులు రాధాకృష్ణరాజుతో పాటు దేవాదాయశాఖ కమిసనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదం కిట్ అందజేస్తున్న మంత్రి రామలింగారెడ్డి

ఎస్సీ వర్గీకరణపై మధ్యంతర నివేదిక

- సీఎం సిద్ధరామయ్యకు అందజేసిన జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీ



వర్గీకరణ మధ్యంతర నివేదికను సీఎంకు అందజేస్తున్న జస్టిస్ నాగమోహన్‌దాస్ 5



ఎంపికైన విద్యార్థులతో వైస్ చాన్సలర్ ఎం.మునిరాజు

జర్మనీ నోబెల్ సమావేశానికి వీఎస్కేయూ విద్యార్థులు 6

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి

- రాయచూరు జిల్లా న్యాయాధికారి హెచ్ఏ సాత్విక్ 5




జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెచ్ఏ సాత్విక్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

మాక్సిమ్ గోర్కి (జయంతి)



రష్యా దేశస్థుడైన మాక్సిమ్ గోర్కి 1868 మార్చి 28న జన్మించారు. సోషలిస్ట్ రియలిజమ్ సాహిత్యానికి ఆధ్యులుగా భావిస్తారు. ఆయన రచనలు రష్యా దేశంలో ఎంతో పేరొంది ఐదుసార్లు నోబెల్ ప్రైజ్‌కు నామినేట్ అయ్యారు. యూనియన్ సోవియట్ రైటర్స్ సంఘానికి అధ్యక్షులుగా వ్యవహరించారు. 1936 జూన్ 18న కన్నుమూశారు.

చిత్తూరు నాగయ్య (జయంతి)



దక్షిణాదిన 'పద్మశ్రీ' పురస్కారం పొందిన తొలి నటుడు చిత్తూరు నాగయ్య 1904 మార్చి 28న గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించారు. ఆయన అసలు పేరు ఉప్పలదడియం నాగయ్య. నటుడిగానే కాక సంగీత కర్త, గాయకుడు, దర్శకుడు, నిర్మాతగా రాణించారు. ఆయన ధరించిన పోతన, త్యాగయ్య, వేమన, రామదాసు వంటి అనేకపాత్రలు బహుళ ప్రజాదరణ పొందాయి. 1938లో 'గృహలక్ష్మి' చిత్రంతో సినీరంగ ప్రస్థానం ప్రారంభమైంది. తెలుగు, తమిళ భాషలలో 336కుపైగా సినిమాల్లో నటించారు. మహారాజుల నుంచి విశ్వవిద్యాలయాలదాకా, ప్రభుత్వంలో ఉన్నతాధికారులనుంచి విశేష గౌరవాలు లభించాయి. త్యాగయ్య సినిమా చూసి నాగయ్యను మైసూరు మహారాజు 101 బంగారు ఆభరణాలు, కంఠాభరణంతో సత్కరించారు. 1978 డిసెంబరు 30న కన్నుమూశారు.

పుట్టపర్తి నారాయణాచార్యులు (జయంతి)



కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలుగు సాహితీకారులలో అగ్రగణ్యుడు, బహూభాషా కోవిదుడైన పుట్టపర్తి నారాయణాచార్యులు 1914 మార్చి 28న అనంతపురం జిల్లా చియ్యేడు గ్రామంలో జన్మించారు. తెలుగు పదాలతో 'శివతాండవం' ఆడించిన కవి. ఆ కావ్యం చదువుకున్నంతసేపూ గుక్క తిప్పుకోనీయదు, కనురెప్ప వాల్చనీయదు, కావ్యంలో ఆయన సాధించిన సౌందర్యం అనితరసాధ్యం, అందుకే ఆ కావ్యాన్ని ఆధునిక మహాకావ్యంగా పలువురు పండితులు అభివర్ణిస్తారు. 140కుపైగా గ్రంథాలు, 7వేలకుపైగా సంగీత స్వరకల్పన చేశారు. ఫ్రెంచ్, పర్షియన్ సహా 14భాషలలో పండితులు. 1990 సెప్టెంబరు 1న కన్నుమూశారు. ప్రొద్దటూరులో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు.

జిల్లెళ్ళమూడి అమ్మ (జయంతి)




'జిల్లెళ్ళమూడి అమ్మ'గా పేరొందిన మాతృశ్రీ అనసూయ దేవి 1923 మార్చి 28న గుంటూరు జిల్లాలో మన్నవ గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచి అనేక మహిమలు కలిగి చాటారు. 'నేను అమ్మని మీరు నా బిడ్డలు' అనేవారు. అమ్మ వేదాంత సూత్రం 'ప్రపంచమంతా ఒక్కటే, ఒక్కడే దేవుడు'. ప్రజలకు ఆధ్యాత్మిక అంశాలపై ఉపదేశములు ఇచ్చేవారు. జిల్లెళ్ళమూడిలోని 'అనసూయేశ్వరాలయం' నిరంతరం అన్నదాన కార్యక్రమం జరిగే ఆలయం. 1978లో మాతృశ్రీ మెడికల్ సెంటర్, మాతృశ్రీ ఓరియంటల్ కాలేజ్, సంస్కృత పాఠశాలలను నిర్వహించారు. 1985 జూలై 12న నిర్యాణం చెందారు.

మున్ మున్ సేన్ (పుట్టినరోజు)



మున్ మున్ సేన్ 1954 మార్చి 28న కోల్కత్తాలో జన్మించారు. బెంగాలీ, హిందీ, తమిళ, తెలుగు, తమిళ, మలయాళ, మరాఠీ, కన్నడ భాషల సినిమాలలో నటించారు. బుల్లితెరపైనా 40కుపైగా సీరియల్స్‌లో నటించారు. 1987లో 'సిరివెన్నెల' చిత్రంలోని ఆమె నటనకు ఉత్తమ సహాయనటిగా నంది పురస్కారం అందుకున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బంకురా నియోజకవర్గం నుంచి ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ తరపున లోక్‌సభ సభ్యురాలిగా 2014 నుంచి 2019వరకు ప్రాతినిథ్యం వహించారు. ఆమె కుమార్తెలు రీమాసేన్, రియాసేన్‌లు నటులుగా కొనసాగుతున్నారు.

నాజర్ హుసేన్ (పుట్టినరోజు)



బ్రిటీష్ క్రికెట్ కామెంటేటర్ నాజర్ హుసేన్ 1968 మార్చి 28న జన్మించారు. మాజీ క్రికెటర్, ఇంగ్లండ్ క్రికెట్ జట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించారు. 96 టెస్ట్ మ్యాచ్‌లు, 88 వన్డేలు ఆడారు. 650కుపైగా మ్యాచ్‌లలో 62 సెంచరీలతో కలిపి 30వేలకుపైగా పరుగులు సాధించారు. 2005లో ఆటో బయోగ్రఫీ 'ప్లేయింగ్ విత్ ఫైర్' రచనకు బ్రిటీష్ స్పోర్ట్స్ బుక్ అవార్డు అందుకున్నారు.

లేడి గాగా (పుట్టినరోజు)



లేడి గాగా పేరొందిన స్టెఫాని జొన్నె అంజెలినా గెర్మానొట్టా 1986 మార్చి 28న జన్మించారు. అమెరికా దేశంలో పేరొందిన గాయని, గేయ రచయిత, నటి. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్, 12 గ్రామీ అవార్డ్స్, సాంగ్ రైటర్స్ హాల్ ఆఫ్ ఫేమ్, కౌన్సిల్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనర్స్ ఆఫ్ అమెరికా తదితర అవార్డులు అందుకున్నారు. ఎబార్న్ దిస్ వే ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి యువతలో ఆరోగ్యంపై చైతన్యం కల్పించారు.

కిలకిల..విలవిల..!


● విధానసౌధలో తాగునీటి కోసం పక్షుల హాహాకారాలు ● ఏర్పాట్లపై నిర్లక్ష్యం



మేడలే తప్ప నీటి జాడ లేదు..



అయ్యో..ఆశతో వచ్చానే..



చుక్క నీరైనా కానరాదే..

కిలకిల శబ్దాలతో అందాలు పంచే పక్షులు దాహంతో విలవిలలాడుతున్నాయి. అదీ అక్కడా, ఇక్కడా కాదు.. ఏకంగా రాష్ట్రాన్ని పాలించే విధానసౌధలో. రాష్ట్ర పాలనాశక్తికేంద్రం విధాన, వికాససౌధలు. రాష్ట్రమంతటా ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించే వేదిక కూడా ఇదే అయితే అటువంటి విధానసౌధ ప్రాంగణంలో ఎండవేడిమి తట్టుకోలేక పక్షులు తల్లడిల్లు తున్నాయి. విశాలమైన భవనం, కబ్బన్ పార్కులో వేలాది చెట్లు పావురాలు, గద్దలే కాకుండా పలు పక్షులు శక్తికేంద్రంలో సేదతీరుతుంటాయి. పక్షులు తాగేందుకు నీరుండాలని పలు చోట్ల భారీ తొట్టెలు ఏర్పాటు చేశారు. అయితే ఎండలు మండుతున్నా కనీసం వాటిలో నీటిని నింపడానికి అధికారులకు చేతులు రావడం లేదు.

(ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, బెంగళూరు)



నీరు లేదు నీడ కోసమే..

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి

రాయచూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బాలకార్మిక పద్ధతితో పాటు జీతం ఉంచుకునే పద్ధతి కూడా చట్టబద్ధంగా ఆమోదయోగ్యం కాదని ఆ పద్ధతి నిర్మూలన కోసం ప్రతియొక్కరు సహకరించాలని జిల్లా ప్రథమ శ్రేణి న్యాయాధికారి, న్యాయసేవా ప్రాధికార సభ్య కార్యదర్శి ఎచ్ఏ సాత్విక్ అన్నారు. జీత నిర్మూలన దినాచరణను పురస్కరించుకుని జిల్లాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని న్యాయాధికారి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన గతంలో జీత పద్ధతి ఎక్కువగా ఉండేదని జీత నిర్మూల చట్టం అనంతరం ఈ పద్ధతికి అనేక చోట్ల స్వస్తిపలికారని ఇప్పటికి కొన్నిచోట్ల జీతపద్ధతి కొనసాగుతున్నట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో అధికారులు వాటి పై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో పని చేసే ఉద్యోగులు జీత పద్ధతి గురించి సమాచారం ఉన్నట్లైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియ జేయాలన్నారు. ఇలాంటి సమాచారం వల్ల జీతం ఉంచుకున్న వ్యక్తుల పై చట్టపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తద్వార జీత నిర్మూలన పద్ధతి పై విస్తృత ప్రచారం కల్పించే అవకాశం లభిస్తుందన్నారు. ఒక రోజు పాటు నిర్వహించే జీత నిర్మూలన కార్యాగారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా 13వ కన్నడ సాహిత్య సమ్మేళనం

గంగావతి రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కాలేజ్ మైదానంలో గురువారం కన్నడ సాహిత్య సమ్మేళనం ప్రారంభమైంది. గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో వివిధ కళాతండాలతో భువనేశ్వరీ దేవి ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కన్నడ సాహిత్య సమ్మేళనం కర్ణాటక కవిత్వం ఉందంటే ఇలాంటి సాహిత్య పరిషత్, జిల్లా కన్నడసాహిత్య పరిషత్ తాలూకా కన్నడ సాహిత్యాలు జరగడం హర్షించతగ్గ విషయమన్నారు. కన్నడ సాహిత్య సమ్మేళనానికి 110 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. మొదటి సారిగా జ్ఞానపీఠ అవార్డు లభించిందన్నారు. కన్నడ సాహిత్య అధ్యక్షుడు లింగారెడ్డి, ఆలూరు మాజీ ఎమ్మెల్యే పరన్నమునవళ్లి, శ్రీనాథ్, మాజీ ఎంపీ శివరామ్ గౌడ, తాలూకా నగరసభ అధ్యక్షుడు మౌలానసాబ్, పార్వతి, శేఖర్‌గౌడ, కన్నడ అభిమానులు పాల్గొన్నారు.



భువనేశ్వరిదేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి

కాంట్రాక్టర్ల కుమ్మక్కు..!

● వేలంలో పంచాయతీ ఆదాయానికి భారీగా గండి

సోమందేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ గంగాదేవి అధ్యక్షతన గురువారం నిర్వహించిన వేలంపాటలో కాంట్రాక్టర్లు కుమ్మక్కై పంచాయతీ ఆదాయానికి భారీగా గండకొట్టారు. సిండికేట్‌గా మారి తక్కువ ధరకే వేలాలు పాడి దక్కించుకున్నారు. అంతా ప్రణాళికబద్ధంగా జరిగింది. వారపుసంత సర్కారువారిపాట రూ.18లక్షలుకాగా కేవలం ముగ్గురు మాత్రమే పోటీపడ్డారు. హరి, శివశంకర్, వెంకటేశులు పోటీపడగా హరి రూ.18,7000కు దక్కించుకున్నారు. బస్టాండుకు సంబంధించిన వేలంపాటలో శివశంకర్, నరేంద్ర పోటీపడగా సర్కారువారిపాట రూ.60వేలుకాగా రూ.63,500కు నరేంద్ర దక్కించుకున్నారు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండిపడింది. అనంతరం పంచాయతీ కాంప్లెక్స్ గదులకు వేలాలు నిర్వహించారు. అదేవిధంగా గత యేడాది 2024-25సంవత్సరానికి 9నెలల కాలానికి వేసిన వేలాల్లో అప్పట్లో సర్కారువారిపాట రూ.13లక్షలు కాగా గుత్తేదారు హరిక్రిష్ణ రూ.13,5000 దక్కించుకోగా, బస్టాండు వేలం రూ.50వేలుకాగా రూ.50,500కు కిష్టప్ప దక్కించుకున్నారు. క్రితం వేలాల్లో ఇదే తంతు జరిగింది. గత యేడాది వేలాల్లో వారపు సంత, కాంప్లెక్స్ గదులకు సంబంధించి రూ.10,72,600 బకాయిలు ఉన్నాయి. ఇంతవరకు అవి వసూలైన దాఖలాలులేవు. ఇలా గత కొన్నేళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నా దాదాపు రూ.కోటివరకు బకాయిలు పేరుకుపోయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అధికారులు, కాంట్రాక్టర్లపై కఠినంగా వ్యవహరించకపోవడంపట్ల ఈ బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఏడాది లోపు విడతలవారిగా బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించని పక్షంలో వారిపై చర్యలు తీసుకునే అధికారం పంచాయతీకి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ రోజు జరిగిన వేలాల్లో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, వేలం దక్కించుకున్న కాంట్రాక్టను హెచ్చరించారు. బకాయిలను రెండు రోజుల్లోగా చెల్లించకపోతే డిపాజిట్ పంచాయతీ పద్దులకు జమచేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. తిరిగి వేలాలు నిర్వహిస్తామని ఖరాఖండిగా తేల్చిచెప్పారు. పేరుకుపోయిన బకాయిల విషయంలో పంచాయతీ ఇన్చార్జ్ కార్యదర్శి రామాంజనేయులును వివరణ కోరగా త్వరలో పాత కాంట్రాక్టర్లపై చట్టబద్ధమై చర్యలు తీసుకుంటామన్నారు. బకాయిల వివరాలు అడగ్గా ఆయన చెప్పడానికి నిరాకరించారు. సమాచార హక్కుచట్టం కోరితే వివరాలు ఇస్తామని తెలిపారు.



బాల్య వివాహాలతో అనర్థాలు

● హిందూపురం ప్రత్యేక న్యాయాధికారి

హిందూపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చేయడంవల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయని హిందూపురం ప్రత్యేక న్యాయాధికారి రమణయ్య తెలిపారు. గురువారం పరిగి మండలం, ధనాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో లైంగిక వేధింపులు వివాహాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, న్యాయవాదులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని మడకశిర సివిల్ కోర్టు న్యాయాధికారి అశోక్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని గుండుమల కేజీబీవీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ పోక్సో చట్టాల గు రించి విద్యార్థులకు వివరించారు. ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని, సీఐ నగేష్‌బాబు, న్యాయవాది గోపీనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలం పాపిరెడ్డిపల్లి కేజీబీవీలో గురువారం విద్యార్థులకు లైంగిక నేరాలపై జూనియర్ సివిల్ న్యాయాధికారి ముజీబ్ పసపలస య్యద్ అవగాహన కల్పించారు. న్యాయాధికారి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన అవసరమన్నారు. అనంతరం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎస్ఓ అనిత, అడ్వకేట్ సుధాకర్, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి రమణయ్య

2 నుంచి మధురైలో సీపీఎం జాతీయ మహానాడు

ప్యారీస్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2 నుండి 6వ తేదీ వరకు మధురైలో సీపీఎం జాతీయస్థాయి మహానాడు జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం పేర్కొన్నారు. గురువారం ఆయన మధురైలో మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 2వ తేదీ ఉదయం పశ్చిమ బెంగాళ్ సీనియర్ నేత భీమన్ బాసు పతాకాన్ని ఆవిష్కరించి సీపీఎం 24వ జాతీయస్థాయి మహానాడు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మహానాడులో, కశ్మీర్ నుండి కన్నియాకుమారి వరకు కేంద్రపాలిత రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అఖిల భారత సీపీఎం ఆర్గనైజర్ ప్రకాశ్‌కారత్, కేరళ సీఎం పినరయి విజయన్, బృందాకారత్, త్రిపుర మాజీ సీఎం మానిక్ సర్కార్, పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దిబాంకర్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ పార్టీ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ సహా పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. 3వ తేదీ సాయంత్రం జరగనున్న కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కర్ణాటక రెవెన్యూ శాఖామంత్రి కృష్ణబైరే గౌడ, కేరళ సీఎం విజయన్ పాల్గొని రాష్ట్రాల హక్కులు, భద్రత అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. 6వ తేదీ వండియూర్ రింగురోడ్డులోని టోల్‌గేట్ సమీపంలో నిర్వహించనున్న బహిరంగసభలో కామ్రేడ్లు జి.రామకృష్ణన్, కె.బాలకృష్ణన్, వాసుకి, సంపత్ తదితరులు పాల్గొంటారని షణ్ముగం తెలిపారు.



సీఎం స్టాలిన్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



పరేడ్‌లో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ అమరేశ్‌గౌడ

శాంతిభద్రతలకు భంగం వాటిల్లరాదు : సీఐ

దొడ్డబళ్ళాపుర, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో దొడ్డబళ్ళాపుర పట్టణంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ముందస్తు చర్యలలో భాగంగా గురువారం టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద పాత రౌడీషీటర్లను పరేడ్ నిర్వహించారు. సీఐ అమరేశ్‌గౌడ మాట్లాడుతూ చట్టాన్ని అతిక్రమించి ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇకనైనా తీరు మార్చుకుని జీవనం సాగించాలని, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడరాదని హెచ్చరించారు. నిర్లక్ష్యం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుని సరిహద్దు దాటిస్తామని హెచ్చరించారు. ఎస్సై కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి మఠానికి శిరూరుమఠం స్వామీజీ



నాగేశ్‌ను ఆశీర్వదిస్తున్న వేదవర్ధనస్వామీజీ

చింతామణి రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠానికి 1008 శిరూరుమఠం, ఉడుపి పర్యాయమఠాధిపతి వేదవర్ధన స్వామిజీ గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొందరు భక్తులకు విచ్చేయగా పాదపూజ అందుకున్నారు. అనంతరం రాయరమఠంలో పూజలు చేశారు. బక్తులకు మంత్రాక్షతలు అందించి ఆశీర్వదించారు. అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ చిక్కబళ్ళాపుర జిల్లా ప్రతినిధిగా పోటీ చేస్తున్న నాగేశ్ కూడా విచ్చేసి స్వామిజీ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా చింతామణి తాలూకా బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు ఎన్ కృష్ణ, ఉపాధ్యక్షుడు మురళీధర్, మార్గదర్శకులు, బీఆర్ శ్రీనాథ్, డీఎల్ ప్రసాద్, రవిప్రకాశ్, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మధ్యంతర నివేదిక

● సీఎంకు అందజేసిన జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీ


బెంగళూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి మాజీ న్యాయమూర్తి హెచ్ఎన్ నాగమోహన్‌దాస్ కమీషన్ మధ్యంతర నివేదికను సీఎం సిద్ధరామయ్యకు అందించారు. గురువారం సీఎం అధికారిక నివాసంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు మునియప్ప, మహదేవప్పతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి షాలినిరజనీష్ తదితరులు పాల్గొన్నారు. మధ్యంతర నివేదికను అందించిన తర్వాత జస్టిస్ నాగమోహన్‌దాస్ మీడియాతో మాట్లాడుతూ రెండు నెలలుగా నివేదిక తయారు చేశామన్నారు. 104 పేజీలతో నివేదిక ఇచ్చామన్నారు. మధ్యంతర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరలేదన్నారు. ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే అన్నారు. ఉద్యోగాలు ఆశిస్తున్నవారికి అన్యాయం జరుగరాదన్నారు. వారికి శాశ్వత పరిహారం ఇవ్వాలన్నారు. నివేదికపై ప్రభుత్వం ఎటువంటి సమాధానం ఇవ్వలేదన్నారు. నియామకాలకు సంబంధించి కూడా ఏవిధమైన సలహాలను ఇవ్వలేదన్నారు. నివేదికకు సంబంధించిన ఎటువంటి అంశాలను బహిరంగంగా ప్రస్తావించేందుకు వీలులేదని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. వర్గీకరణను జాప్యం చేసేందుకు ఇదో కారణమని భావించడం లేదన్నారు. వర్గీకరణ విషయంలో శాశ్వతమైన పరిష్కారం కావాలనేది మా ఆశయమన్నారు. మధ్యంతర నివేదికపై ప్రభుత్వం ఎటువంటి తీర్మానాలు చేస్తుందో పరిశీలించాక తదుపరి సమగ్ర నివేదికను సమర్పిస్తామన్నారు. మధ్యంతర నివేదికపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

భారీగా తగ్గిన పంచాయతీ ఆదాయం

లేపాక్షి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండు, వారపుసంత వేలంపాట గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓఆర్డీ ఆనంద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. బస్టాండు వేలంపాట లేపాక్షి గ్రామానికి చెందిన గోవిందప్ప రూ.34,56,000 సొంతం చేసుకున్నారు. వారపుసంతను లేపాక్షికి చెందిన నయాజ్ రూ.2,12,000కు దక్కించుకున్నాడు. వారం రోజుల క్రితం ఇదే బస్టాండు వేలంను రూ.72,01,000కు శంకర్‌రెడ్డి దక్కించుకోగా వారపుసంత లేపాక్షి నరేష్ రూ.3,21,000కు దక్కించుకున్నాడు. సకాలంలో డబ్బులు చెల్లించలేదని వేలం వాయిదా వేశారు. పంచాయతీ అధికారుల సమక్షంలో జరిగిన వేలంలో కాంట్రాక్టర్లు కుమ్మక్కయి వేలం దక్కించుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సగానికి పైగా ఆదాయం కోల్పోవడంతో మండల ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి

రొళ్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని జడ్పీటీసీ అనంతరాజు, ఎంపీపీ కవిత విజయరంగేగౌడ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కానీ సమాచారం అందివ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ మండలంలో ఐదు పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేశామని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల కమిటీ చైర్మన్ అభిప్రాయాల మేరకు పాఠశాలలను ఎంపిక చేస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1595.07	1,581.64
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,191	844
నీటి నిల్వ (టీఎంసీలు)	15.79	5.32

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



వృద్ధుడి మృతదేహం

బళ్లారి రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పీడీ హళ్ళి పోలీస్‌స్టేషన్ సమీపంలోని చెళ్లగుర్కి గ్రామంలో గుర్తుతెలియని మృతదేహం లభించింది. స్థానిక ఎర్రిస్వామి జీవసమాధి మఠం సమీపంలో గురువారం ఉదయం స్థానికులు గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించి పీడీహళ్ళి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వృద్ధుడి వయస్సు 65నుంచి 70సంవత్సరాలు ఉండవచ్చని, ఎవరైన గుర్తించి సమాచారం ఇవ్వగలరని తెలిపారు. 9480803052, 94808 03031 నంబరుకు సంప్రదించాలని తెలిపారు. వృద్ధుడి మృతదేహాన్ని బళ్లారి బిమ్స్ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు.

పండుగలు ప్రశాంతంగా చేసుకోవాలి: ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ నాగభూషణ్

బళ్లారి రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ నాగ భూషణ్ సూచించారు. తాలూకాలోని పీడీహళ్ళి పోలీస్‌స్టేషన్‌లో పండుగల సందర్భంగా గురువారం శాంతిసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ.. రెండు పండుగలు వరుసగా వస్తున్నందున ప్రశాంతగా నిర్వహించు కోవాలని, ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఈసందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప, క్రైం ఇన్స్‌పెక్టర్ పరమేశ్వరప్ప, కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి, పలు గ్రామాల హిందూ, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

హట్టి గని కార్మికుడికి గాయాలు



లక్ష్మణ్

రాయచూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని లింగసుగూరు తాలూకా హట్టి బంగారు గనుల్లో పని చేస్తున్న కార్మికుడొకరికి స్వరంగంలో రాయి పడి తీవ్రంగా గాయాలైయ్యాయి. లక్ష్మణ(36) అనే కార్మికుడు తోటి కార్మికులతో కలిసి బుధవారం రాత్రి దాదాపు 2 వేల అడుగుల పై ఉన్న భూగర్భ స్వరంగంలో పని చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రాయి పడడంతో తీవ్రంగా రక్తస్రావం జరుగుతుండగా తోటి కార్మికులు ఆయనను బాగలకోట ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బంగారు గనుల అధికారులు సంఘటన స్థళాన్ని పరిశీలించి ప్రమాదం గురించి ఇతర కార్మికులను అడిగి తెలుసుకున్నారు. సంఘటన హట్టి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకోగా సమాచారం పోలీసులకు ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిసింది.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● డిప్యూటీ మేయర్ సుకుమ్

బళ్లారి సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తోంది, పట్టణ ప్రాంతాల్లోనూ అన్ని సేవలు ఉచితంగా అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సుకుమ్ అన్నారు. గురువారం బళ్లారి నగరంలోని నాయుడు వీదిలోని కౌల్‌బజార్‌లో నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాపంచాయతీ, కాయకల్ప కింద అందుబాటులో ఉన్న నిధులతో పునరుద్దరించబడిన వార్డును ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్‌వంటి వ్యాదులను నిర్దారించడానికి అవసరమైన సాధనాలను ఇక్కడ ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు క్రమం తప్పకుండా సకాలంలో పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. డీహెచ్ఓ రమేశ్‌బాబు మాట్లాడుతూ బళ్లారి సిరుగుప్ప తాలూకాలలో మొత్తం 9పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. కేసులను గుర్తించడానికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో నాణ్యమైన సేవలు కూడా అందించబడుతున్నాయని అన్నారు. దోమ కాటు ద్వారా వ్యాపించే డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా మొదలైన వాటితో పాటు టైఫాయిడ్‌ను కూడా గుర్తిస్తున్నారు. ఈసందర్భంగా నాయకులు రియాజ్ అహ్మద్, అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డా.నరసింహమూర్తి, డా.ఫిర్దోస్, జిల్లాఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్‌దాసప్ప నవర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉప మేయర్ సుకుమ్

ఆవిష్కరణలను ప్రోత్సహించాలి

● జిల్లా వాణిజ్య మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ మునిరాజు

బళ్లారి సిటీ, మార్చి27(ఆంధ్రజ్యోతి): యువతలో అవిష్కరణలను గుర్తించి ప్రోత్సహించాలని ఎఫ్‌కేసీసీఐ 'మంథన్' ప్రత్యేక ప్రాజెక్టును ప్రారంభించిందని బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి అన్నారు. జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి ఆడిటోరియంలో గురువారం జరిగిన మంథన్ 2025 కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి కేవలం వాణిజ్యానికే పరిమితమం కాకుండా యువత రైతులు, స్థానిక అభివృద్ధిలో కూడా చురుగ్గా పాల్గొంటోందన్నారు. విద్యార్థుల సృజనాత్మకత చైతన్యాన్ని గుర్తించి ప్రొత్సహించడం, మూలధన సేకరణ, పెట్టుబడి ఆలోచలలో ప్రతిభను గుర్తించడానికి ప్రోత్సహించడానికి మంథన్ ప్రయత్నం చేస్తోందని కమిటీ ఛైర్‌పర్సన్ తేజశ్రీ అన్నారు. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి ఉపాద్యక్షుడు దొడ్డనగౌడ, రామచంద్ర, కమిటీ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతి వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

● అడిషనల్ ఎస్పీ హరీశ్



మాట్లాడుతున్న ఏఎస్పీ హరీశ్

రాయచూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అతి పెద్ద పండుగలుగా చెప్పుకురే రంజాన్, ఉగాది పండుగలను ముస్లిం-హిందూవులు సౌరుధ్య వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ జీ హరీశ్ సూచించారు. హైందవ సంప్రదాయంలో ఉగాది పర్వ దినానికి విశిష్ఠ ప్రాధాన్యత ఉందని, అంతే ప్రాధాన్యత నెల రోజుల ఉపావాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్‌కు ఉంటుందని రెండు పండుగలు విశిష్టమైనవి కావడంతో ఇరు వర్గాల ప్రజలు ఎలాంటి అహితకరమైన సంఘటనలకు తావివ్వకుండా పండుగలను పర్వదినాలను సంప్రదాయభద్దగా శాంతి భద్రతలతో నిర్వహించుకోవాలన్నారు. ఈ విషయంలో ఇరు వర్గాలకు పోలీసుల తరఫున తగిన సహకారం అందుతుందని ఇలాంటి చిన్న సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గురువారం నగరంలోని సదర్ బజార్‌లో రెండు పండుగల నేపద్యంలో ఇరు వర్గాలకు చెందిన మత పెద్దలతో శాంతి సభ నిర్వహించారు. సభలో మాట్లాడిన డీఎస్పీ శాంతవీర, విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు వాలువైలమైన భారత దేశంలో అన్ని వర్గాల ప్రజలు తమ సంప్రదాయాల ప్రకారం శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి చిన్న సంఘటనలు జరిగినా తక్షణ సమాచారం పోలీసులకు అందజేయాలన్నారు. అదే సమయంలో పండుగల సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందుజాగ్రత చర్యలు తీసుకుంటున్నారని ఇందుకు రెండు వర్గాలు సహకరించాలని కోరారు.

జయంతులను ఘనంగా నిర్వహించాలి

● అధికారులకు తహసీల్దార్ ఆదేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విశ్వనాథ్

సిరుగుప్ప, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ జయంతులను ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. గురువారం సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ది కార్యాలయంలో రెండు జయంతులను ఆచరించడానికి సన్నాహక సభ జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు ఈ జయంతులను ఆచరించడంపై ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈసందర్భంగా తాలూకా సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ సిద్దయ్య, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పట్టణప్రజలు పాల్గొన్నారు.

జర్మనీలో సమావేశానికి వీఎస్కేయూ విద్యార్థులు

బళ్లారి గాంధీనగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జర్మనీలోని లిండౌలో జూన్ 29వ నుంచి జులై 4వ తేదీ వరకు జరిగే ప్రముఖ అంతర్జాతీయ లిండవ్ నోబెల్ గ్రహీతల సమావేశానికి నగరంలోని విజయనగర శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.మునిరాజు గురువారం తెలిపారు. వీఎస్కేయూలో రసాయన శాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థి గౌతమి పాటిల్, డాక్టర్ నసీమ్ కౌసర్‌లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కేంద్రంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ డీఎస్టీ దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 29మంది విజ్ఞానుల్లో ఈ ఇద్దరు విద్యార్థులు ఉండడం అభినందనీయమన్నారు. ఏటా ప్రపంచస్థాయిలో జరిగే సమావేశానికి 600 మంది యువ విజ్ఞానుల ఆహ్వానించి నోబెల్ అవార్డు గ్రహీతలతో చర్చలతో పాటు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తుంది. 74వ రౌండ్ టేబుల్‌సమావేశాలకు ఈ సారి రసాయన శాస్త్రం విభాగానికి దక్కింది. ఎన్నికైన యువ శాస్త్ర వేత్తలకు అయ్యే ఖర్చులను సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ(డీఎస్టీ) భరిస్తుంది. ప్రస్తుతం విఎస్‌కెయు నుండి ఎంపికైన విద్యార్థులు రసాయన శాస్త్రం విభాగం ప్రొఫెసర్ కె.ఎస్.లోకేష్ మార్గదర్శకంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. లిండవ్ నోబెల్ సమావేశానికి ఎన్నికైన విద్యార్థులకు విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ ఎం.మునిరాజు, రిజిస్ట్రార్ ఎస్ఎన్.రుద్రేష్, మౌల్యాంకన విభాగం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.ఎం. సాలి, విశ్వవిద్యాలయం సిబ్బంది అభినందనలు తెలియజేశారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణకు ఎమ్మెల్యే ఆదేశాలు

బళ్లారి సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని మిల్లర్‌పేటలోని కమ్యూనిటీ హాల్‌ను పునరుద్దరించి , కాంపౌండ్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి.. సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలో పర్యటించిన ఆయన స్థానిక 13వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను విన్నారు. ఇక్కడి కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరుకుందని గుర్తించి ప్రజలు ఉపయోగించడానికి మరింత సౌకర్యవంతంగా ఉండేలా దానిని పునరుద్దరించాలని సూచించారు. మిల్లర్‌పేటతో పాటు, గణేశ్ గుడి, కోరటగేరి, అబ్దుల్ అజీన్ వీధితో సహా వివిధ ప్రాంతాలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహానగర కార్పొరేషన్ అధికారులు, ఇంజనీర్లు, జెస్కామ్, పోలీస్, ట్రాఫిక్ పోలీసులు తదితర విభాగాల అధికారులు ఎమ్మెల్యేతోపాటు కలిసి తిరుగుతూ ప్రజల సమస్యలపై స్పందించారు. ఇళ్లపట్టాలు, రోడ్లు, అంతర్గత డ్రైనేజీ, బాహ్య డ్రైనేజీ, వీది దీపాలు, తాగునీరు. పారిశుద్యం వంటి వివిధ సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు సమర్పించారు.ఈసందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు జబ్బార్,రాశేశ్వరీ, కుబేర, కాంగ్రెస్ నాయకులు సుబ్బరాయుడు, బోయపాటి విష్ణు, రసూల్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

నీరు విడుదల చేయాలని రైతు సంఘం వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పంటలు ఎండిపోతున్నాయి, కాల్వకు నీరు విడుదల చేయాలని రైతులు కోరారు. గురువారం కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు వినతి పత్రం ఇచ్చిన రైతులు కంప్లి నియోజకవర్గంలోని గుడదూర్, హండిహాలు, కగ్గల్, చానాల్ గ్రామాలలో, సిరుగుప్ప అసెంబ్లీ నియోజకవర్గంలోని హెచ్.హొసళ్ళి, హగలూర్, దారుర్, కరూర్, గోసబాల, బెళగుప్ప ,మైలార్ గ్రామాలలో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతులు ప్రతి పంటకు దాదాపు రూ.50 వేలు ఖర్చయింది. ఈపంటలను కాపాడటానికి ,పశువులకు త్రాగునీరు అందించడానికి తుంగభద్ర కుడి ఒడ్డున ఉన్న ఎల్ఎల్‌సీ నుండి గూడదూరు వాగుకు 3రోజులపాటు 100క్యూసెక్‌ల నీటిని విడుదల చేస్తే రైతలు పంటలు ఆదా అవుతాయని, పశువులకు ప్రజలకు త్రాగునీరు అందించబడుతుందని రైతు సంఘం అధ్యక్షుడు దరూర్ పురుషోత్తమ గౌడ, రైతు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే



రైతు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేశ్

కంప్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రైతులుప్రభుత్వం ఇచ్చే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాని కంప్లి ఎమ్మెల్యే గణేశ్ అన్నారు. గురువారం కురుగోడు పట్టణంలో రూ.కోటితో నిర్మించిన రైతు సంపర్క కేంద్రా న్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వేదవతికి తక్షణమే నీరు వదలాలి

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప డిమాండ్



ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, మార్చి 27(ఆంధ్రజ్యోతి) వేదవతి నదికి సాగునీరు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప కోరారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో రైతులు చేపట్టిన ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సోమలింగప్ప మాట్లాడుతూ తాలూకాలోని వేదవతి పరీవాహక ప్రాంతాల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. తక్షణమే ఎల్ఎల్‌సీ కాలువలకు నీటిని విడుదలచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈసందర్భంగా ముదినూరు గ్రామం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మీడియా సేవలు మరువలేం: కలెక్టర్



కళాకారుడు పురుషోత్తమ హంద్యాలను సత్కరిస్తున్న కలెక్టర్

బళ్లారి సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి) దేశాభివృద్ధిలో కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ, శాసనసభలతో పాటు మీడియా రంగం నాలుగో స్తంభంగా కష్టపడి పనిచేస్తోందని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ గురువారం ప్రతికాభవనంలో నిర్వహించిన ప్రపంచ రంగస్థల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... బళ్లారిలో మీడియా సహకారం జిల్లాయంత్రాంగానికి ఎంతో ఉందని, ఎన్నికలు అయినా, అభివృద్ధి పనులైన మీడియా బాగస్వామ్యం చిరస్మరణీయమన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని న్నారు. అనంతరం ఫోటో జర్నలిస్ట్, రంగస్థల కళాకారుడు పురుషోత్తం హంద్యాలును సత్కరించారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు యాల్పివలిభాష, కార్యనిర్వహక కమిటీ సభ్యుడు వీరభద్రగౌడ, రిటైర్డ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ చోరనూర్ కొట్రప్ప, జీనియర్ జర్నలిస్ట్ అహిరాజ్, తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తమగౌడ, మీడియా ప్రతినిదులు మహేంద్రకుమార్, వెంకోబి, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

బాలికా విద్యను ప్రోత్సహిద్దాం: కలెక్టర్



బాలింతలకు కిట్లు అందజేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బాలికా విద్యను ప్రోత్సహించేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆడపిల్లలను రక్షించడం, విద్య నేర్పించడం అనే ఇతివృత్తంతో కెలమంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశువు ఆరోగ్యంకోసం పరీక్షలు చేయాలిగానీ లింగనిర్ధారణకోసం కారాదన్నారు. అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. బాలబాలికల మధ్య వివక్షత లేకుండా పెంచాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో ఆడపిల్లల జననాల రేటు తగ్గుతున్న తరుణంలో పరిష్కరించేలా తమిళనాడు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. ఇద్దరు ఆడపిల్లల ఉన్న కుటుంబానికి రూ.50వేలు వారి బ్యాంకు ఖాతాకు జమ చేయడంతోపాటు ప్రస్తుతం బాలికల విద్యకు వెయ్యిరూపాయలు ఇస్తున్నారన్నారు. ఆడపిల్లల తల్లులకు యాపిల్, నారింజ, వేరుశనగ మిఠాయి, ఇతరత్రా శీతలపానీయాలు, వాటర్ బాటిళ్లు, బిస్కట్లు వంటి వాటితో కూడిన కిట్‌ను అందచేశారు. 350మందికిపైగా కిట్లను పంపిణీ చేశారు.

విద్యుత్ తీగలు తాకి మూడు గేదెల మృతి



గేదెల కళేబరాలు

రాయచూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముదగల్ తాలూకా బన్నిగోళ గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తాకి గురువారం మూడు గేదెలు మృత్యువాతపడ్డాయి. బన్నిగోళ నుంచి ఉళిమేశ్వర గ్రామానికి వెళ్లె దారిలో విద్యుత్ తీగలు తెగి పడి ఉండడంతో ఈ ప్రమాదం చోటు చేసుకునంది. ప్రమాదంలో బన్నిగోళ గ్రామానికి చెందిన పరప్ప కుంబార్‌కు చెందిన రెండు గేదెలు, శరణప్ప జంగ్లికి చెందిన మరో గేదె మొత్తం మూడు గేదెలు మృత్యువాతపడ్డాయి. విషయం తెలుసుకున్న పశుసంవర్దక శాఖ అధికారులు సంఘటన స్థళాన్ని పరిశీలించారు. కాగా గేదెలను కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

సమితి సమావేశంలో 8 తీర్మానాలు

● వంద కిలోలకు మించి చెత్త ఉంటే మున్సిపల్ సిబ్బంది తొలగించరు

● పెండ్లి మండపాల వద్ద చెత్త తొలగించేందుకు టన్నుకు రూ.4వేల పన్ను



సమావేశంలో ఆరోగ్య స్థాయి సమితి అధ్యక్షుడు మాదేశ్వరన్

హోసూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ ఆరోగ్యస్థాయి సమితి సమావేశం మాదేశ్వరన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 8 కీలక తీర్మానాలు ఆమోదించారు. కమిషనర్ మారిసెల్వి, మునిసిపల్ సంక్షేమ అధికారిని అజిత్ పాల్గొన్నారు. మాదేశ్వరన్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండగా తట్టు వ్యాధి వ్యాపిస్తోందని, నియంత్రణకు సరిపడా మందులు నిల్వ ఉన్నాయో లేదా సమీక్షించాలని అధికారులకు సూచించారు. తట్టు వ్యాధికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్‌పేషంట్‌ల బంధువుల కోసం కేటాయించే గదులలో సరైన నిర్వహణ లేదనే ఆరోపణలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు 3216 వీధికుక్కలకు సంతానహరణ శస్త్రచికిత్స, రేబిస్ టీకాలు వేసినట్టు తెలిపారు. సర్కార్ ఇతరత్రా ప్రదర్శనలకు కార్పొరేషన్ నుంచి మాత్రమే అనుమతులు లభిస్తాయన్నారు.

పెళ్లిమండపాలు, ఆసుపత్రులు వంటి ప్రదేశాల నుంచి 100కిలోలకంటే ఎక్కువ చెత్తను కార్పొరేషన్ ఉద్యోగులు తొలగించరాదన్నారు. అలా తొలగించాల్సి వస్తే పరిపాలన పన్నుగా టన్నుకు రూ.4వేలు చెల్లించాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు సంబంధించి సోదాలు మరింత కొనసాగాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్‌లు ఆర్ముగం, మోహిన్‌తాజ్, కళావతి చంద్రన్, లక్ష్మి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా డీఎంకే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

హోసూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ముఖ్యులుగా పాల్గొన్నారు. హిందూ గురువు, క్రైస్తవ పాస్టర్, ఒక మౌల్వి పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్, అమ్మ పెరవై ఉప కార్యదర్శి వి పన్నీర్ సెల్వం, దిల్షాద్ ముజఫర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. హజ్ యాత్రకు ఆర్థిక సాయం, ఉపవాస గంజికి ఉచిత బియ్యం అందించే పథకాలను అమలు చేసిన ఘనత పురచ్చి తలైవి అమ్మకే దక్కుతుందని వక్తలు కొనియాడారు. అన్నాడీఎంకే తరఫున పండ్లతోపాటు బిర్యానీ వడ్డించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి